20న 109వ తపాలా అదాలత్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

విశాఖపట్నం పోస్టల్ రీజియన్ పరిధిలోని తపాలా వినియోగదారుల వ్యక్తిగత ఫిర్యాదులు, సమస్యల పరిష్కారానికి ఈనెల 20వ తేదీన 109వ తపాలా అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పోస్ట్‌మాస్టర్ జనరల్ కార్యాలయం సహాయ సంచాలకులు డబ్ల్యు.నాగాదిత్య కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖపట్నం పోస్ట్‌మాస్టర్ జనరల్ కార్యాలయం ఆధ్వర్యాన సోమవారం ఉదయం 11 గంటలకు ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. తపాలా సర్వీసులకు చెందిన ప్రత్యేక, వ్యక్తిగత ఫిర్యాదులు ఈ అదాలత్‌లో చర్చించనున్నట్లు తెలిపారు. ఉమ్మడి విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం, తూర్పు గోదావరి జిల్లాల పరిధిలోని తపాలా వినియోగదారులు తమ ఫిర్యాదులను ఈనెల 16వ తేదీలోగా 109వ తపాలా అదాలత్ అను శీర్షికతో డబ్ల్యు.నాగాదిత్య కుమార్, అసిస్టెంట్ డైరెక్టర్, పోస్ట్‌మాస్టర్ జనరల్ కార్యాలయం, విశాఖపట్నం 530 017 చిరునామాకు పంపాలని కోరారు.

పలాస : ఓటు వేసి సిరాను చూపుతున్న మంత్రి అప్పలరాజు దంపతులు



సిరాను చూపుతున్న యువతులు

స్ట్రాంగ్ రూంకు సీలు వేయిస్తున్న కలెక్టర్, జెసి

ఓటు వేస్తున్న స్పీకర్ సీతారాం

ప్రజాస్వామ్యానికి 'పట్ట'ం

- పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో 71.60 శాతం నమోదు
- 72.82 శాతం మంది ఓటేసిన మహిళలు
- మూడు గంటల తర్వాత భారీగా తరలివచ్చిన ఓటర్లు
- సాయంత్రం నాలుగు తర్వాతా సాగిన పోలింగ్
- చెదురుమదురు ఘటనలు మినహా ప్రశాంతం

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక చెదురుమదురు ఘటనలు మినహా జిల్లాలో ప్రశాంతంగా ముగిసింది. ఓటు హక్కు వినియోగించేందుకు ఓటర్లు బారులు తీరారు. మధ్యాహ్నం రెండు గంటల వరకు మందకొడిగా సాగిన పోలింగ్ ఆ తర్వాత ఊపందుకుంది. శ్రీకాకుళం, పలాస, టెక్కలి ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాలకు మూడు గంటల తర్వాత ఓటర్లు పోటెత్తారు. సాయంత్రం నాలుగు గంటల తర్వాత వచ్చిన వారికి స్లిప్‌లను అందించి ఓటు వేసే అవకాశం కల్పించారు. జిల్లాలో 71.60 శాతం మేర పోలింగ్ నమోదైంది. పురుషుల కంటే మహిళలే అధిక శాతం ఓటింగ్‌లో పాల్గొన్నారు.

జిల్లాలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో భారీగా పోలింగ్ శాతం నమోదైంది. జిల్లాలో 52,256 మంది ఓటర్లు ఉండగా 37,417 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పురుష ఓటర్లు 36,412 మంది ఉండగా 25,883 మంది ఓటు వేశారు. మహిళా ఓటర్లు 15,839 మంది ఉండగా 11,534 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూం ద్వారా జిల్లావ్యాప్తంగా ఉన్న పోలింగ్ కేంద్రాల పరిస్థితిని జాయింట్ కలెక్టర్ స్వయంగా పర్యవేక్షించి, పోలింగ్ సిబ్బందికి ఎప్పటికప్పుడు సూచనలు చేశారు. పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్, వీడియోగ్రఫీ ఏర్పాటు చేశారు.

కలెక్టర్,ఎస్‌పి పోలింగ్ కేంద్రాల పరిశీలన

పట్టభద్రుల ఎన్నికల పోలింగ్ సరళిని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్, ఎస్‌పి జి.ఆర్ రాధిక పరిశీలించారు. కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల కేంద్రాన్ని సందర్శించి పోలింగ్ సాగుతున్న తీరు, ఏర్పాట్లను పరిశీలించారు. ఎస్‌పి రాధిక పిఎస్‌ఎన్‌ఎంహెచ్ స్కూల్‌లోని 52, 53 పోలింగ్ కేంద్రాలను, పొందూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల కేంద్రాలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

సంతబొమ్మాళి, పలాసలో స్వల్ప ఉద్రిక్తత

సంతబొమ్మాళి మండలంలో నాలుగు గంటలకు వచ్చిన ఇజ్జువరానికి చెందిన ఒక మహిళకు ఓటు వేసే అవకాశం కల్పించడంతో కొంత ఉద్రిక్తత చోటుచేసుకుంది. పోలింగ్ ముగిసిన తర్వాత 4.02 నిమిషాలకు వచ్చిన ఓటరుకు ఎలా ఓటు ఇస్తారంటూ టిడిపి నాయకులు ఎస్ఐ మధుసూదనరావును ప్రశ్నించారు. 3.58 గంటలకు రావడంతో పంపించామని ఎస్ఐ మధుసూదనరావు తెలిపారు. పోలింగ్ సమయం తర్వాత పంపించారని టిడిపి నాయకులు నిలదీయడంతో వైసిపి నాయకులు, వారి మధ్య స్వల్ప తోపులాట చోటుచేసుకుంది. టెక్కలి సిఐ చంద్రమౌళి, సంతబొమ్మాళి ఎస్ఐ మధుసూదనరావు వారిని చెదరగొట్టారు. ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ సంతబొమ్మాళి పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని టిడిపి నాయకులను అరెస్టు చేయాలని బైఠాయించారు. పలాసలో నాలుగు గంటల సమయంలో టిడిపికి చెందిన నాయకుడు ఓటర్ల వద్ద ప్రచారం చేస్తున్నారని ఆరోపిస్తూ వైసిపి నాయకులు పోలింగ్ కేంద్రం వద్దకు వాగ్వివాదానికి దిగారు. సిఐ శ్రీనివాసరావు వారిని పోలింగ్ కేంద్రం నుంచి బయటకు పంపేశారు. శ్రీకాకుళం నగరంలోని స్థానిక ఎన్‌టిఆర్ మున్సిపల్ హైస్కూల్ కేంద్రంలో సాయంత్రం నాలుగు గంటల తర్వాత వైసిపి సానుభూతిపరులను విడిచిపెట్టి తమను లోపలకు వెళ్లనీయలేదని టిడిపి నాయకులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు.

డివిజన్ల వారీగా పోలింగ్ శాతం వివరాలు

డివిజన్	మొత్తం ఓటర్లు	ఓటు వేసిన వారు	పోలింగ్ శాతం
శ్రీకాకుళం	29,631	20,788	70.16
టెక్కలి	11,103	8,069	72.67
పలాస	11,522	8,560	74.29
మొత్తం	52,256	37,417	71.60

మహిళ, పురుష ఓటర్ల నమోదు ఇలా...

డివిజన్	పురుష ఓటర్లు	ఓటు వేసిన వారు	శాతం	మహిళా ఓటర్లు	ఓటు వేసిన వారు	శాతం
శ్రీకాకుళం	20,437	14,379	70.36	9,190	6,409	69.74
టెక్కలి	8,043	5,763	71.65	3,060	2,306	75.36
పలాస	7,932	5,741	72.38	3,589	2,819	78.54
మొత్తం	36,412	25,883	71.08	15,839	11,534	72.82

నౌపడ : వైసిపి, టిడిపి నాయకులను చెదరగొడుతున్న పోలీసులు

ఓటు వేసేందుకు క్యూలో ఉన్న ఓటర్లు

పలుచోట్ల నిరాశతో వెనుదిరిగిన ఓటర్లు

పోలింగ్ కేంద్రానికి సమయానికి చేరుకోలేకపోవడంతో చాలాచోట్ల ఓటు వేయకుండానే ఓటర్లు వెనుదిరిగారు. సాయంత్రం గంటలకు పోలింగ్ ముగియడంతో అధికారులు గేట్లు వేసేశారు. దీంతో ఓటు వేయకుండా నిరాశతో వెనుదిగారు. శ్రీకాకుళం నగరం, పలాస, టెక్కలి ప్రాంతాలతో పాటు పలు కేంద్రాల్లో ఈ పరిస్థితి తలెత్తింది.

పోలింగ్ ప్రక్రియలో ఆలస్యం

పోలింగ్ ప్రక్రియలో ఆలస్యం కావడంతో చాలా కేంద్రాల్లో భారీగా ఓటర్లు బారులు తీరారు. ప్రధానంగా వెయ్యి మంది దాటిన ఓటర్లకు తగినంత మంది సిబ్బందిని నియమించకపోవడం, ఒకే బూత్ ఏర్పాటు చేయడంతో ఈ సమస్య తలెత్తింది. దీంతోపాటు ఓటు వేసిన తర్వాత ఓటర్లు బ్యాలెట్ పేపర్లను సరిగా మడతపెట్టి వేయకపోవడంతో 200 బ్యాలెట్ పత్రాలు నిండాల్సిన చోట వంద బ్యాలెట్లకే బాక్సు నిండిపోయాయి. బాక్సులు మార్చడంలో కొంత సమయం వృథా అయింది. దీంతోపాటు కొన్నిచోట్ల సిబ్బంది కొత్తవారు కావడంతో నిదానంగా చేశారు.

ఓటు వేసి సిరాను చూపుతున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ దంపతులు

అరగంట ఆలస్యం

ఆమదాలవలస ప్రభుత్వ పాఠశాలలోని 43, 43ఎలో సిబ్బంది ఏర్పాట్లు పూర్తి చేయడంతో ఆలస్యం కావడంతో ఎనిమిది గంటలకు ప్రారంభం కావాల్సిన పోలింగ్ అరగంట ఆలస్యంగా ప్రారంభమైంది. లావేరులో పోలింగ్ రాత్రి 7 గంటల వరకు కొనసాగింది. పోలింగ్ కేంద్రంలో ఒకే గేటు ఉండడంతో ఓటు వేసేందుకు వచ్చే వారు, వెళ్లేవారికి ఇబ్బంది కలిగింది.

మధ్యాహ్నం మూడు తర్వాత భారీగా తరలివచ్చిన ఓటర్లు

జిల్లాలో పలు పోలింగ్ కేంద్రాలకు మధ్యాహ్నం మూడు గంటల తర్వాత భారీగా ఓటర్లు తరలివచ్చారు. ఉపాధ్యాయులు, ప్రభుత్వ, ప్రయివేట్ ఉద్యోగులకు ప్రభుత్వం సెలవు ఇవ్వకపోవడంతో సాయంత్రం సమయంలో అధికారుల అనుమతితో ఓటు వేసేందుకు అధిక సంఖ్యలో తరలివచ్చారు. రెండున్నర గంటలకు పైగా ఓపికగా క్యూలైన్లో ఉండి ఓటు వేశారు. సాయంత్రం నాలుగు గంటలకు క్యూలైన్లో ఉన్న వారికి అధికారులు స్లిప్పులు ఇచ్చి ఓటు వేసే అవకాశం కల్పించారు.

ఓటు హక్కు వినియోగించుకున్న ప్రముఖులు

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పలువురు ప్రముఖులు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. పలాసలోని జూనియర్ కళాశాలలోని పోలింగ్ కేంద్రంలో రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు, ఆయన సతీమణి ఓటు వేశారు. శ్రీకాకుళం నగరంలోని టిపిఎం హైస్కూల్‌లోని 59 పోలింగ్ బూత్‌లో కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్, ఆయన సతీమణి ఓటు హక్కును వినియోగించుకున్నారు. మాజీ ఉప ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, ఆయన సతీమణి పద్మప్రియ, పోలాకి జెడ్‌పిటిసి ధర్మాన కృష్ణచైతన్య పోలాకి మండలం మబుగాంలో ఓటు వేశారు.

పలాస : ఓటు వేసేందుకు బారులు తీరిన ఓటర్లు

'స్థానికం' 96.91%

- ప్రశాంతంగా ముగిసిన పోలింగ్
- ఓటర్లను తోడ్కొని వచ్చిన ఎమ్మెల్యేలు, నాయకులు
- పలువురు టిడిపి మద్దతుదారులు ఓటింగ్‌కు దూరం

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలు సోమవారం ప్రశాంతంగా ముగిశాయి. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలోని నాలుగు కేంద్రాల్లో ఉదయం ఎనిమిది గంటలకు పోలింగ్ మొదలై సాయంత్రం నాలుగు గంటలతో ముగిసింది. జిల్లాలో 96.91 శాతం పోలింగ్ నమోదైంది. జిల్లాలో మొత్తం 776 మంది ఓటర్లు ఉండగా 752 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పురుష ఓటర్లు 310 మంది ఉండగా 303 మంది ఓటు వేశారు. మహిళల్లో 466 మంది ఓటర్లకు గానూ 449 మంది ఓటు వేశారు. టెక్కలి డివిజన్‌లో అత్యధికంగా 99.38 శాతం పోలింగ్ శాతం నమోదైంది. పోలింగ్ అనంతరం పటిష్ట పోలీసు బందోబస్తు మధ్య శ్రీకాకుళం నగరంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలోని స్ట్రాంగ్ రూమ్‌కు బ్యాలెట్ బాక్సులను తరలించారు.

జిల్లాలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ఉదయం పది గంటల వరకు మందకొడిగా సాగింది. ఉదయం పది గంటల్లోపు 14.70 శాతం పోలింగ్ నమోదైంది. మధ్యాహ్నం 12 గంటలయ్యేసరికి ఊపందుకుంది. 12 గంటలకు 69.46 శాతం మంది ఓటు వేశారు. మధ్యాహ్నం రెండు గంటల సమయానికి 90.59 శాతం పోలింగ్ నమోదైంది. పంచాయతీరాజ్ ఛాంబర్, తూర్పు కాపు సామాజిక తరగతి మద్దతుతో బరిలో దిగిన స్వతంత్ర అభ్యర్థి ఆనెపు రామకృష్ణ పోటీలో ఉండడంతో పోలింగ్ సమయంలోనూ వైసిపి నేతలు జాగ్రత్తలు తీసుకున్నారు. సామాజిక తరగతి పేరుతో రామకృష్ణ వైపు తమ ఓటర్లు మొగ్గుచూపుతారేమోనన్న సంశయంతో ఎమ్మెల్యేలు, వైసిపి ముఖ్య నేతలు వారిని పోలింగ్ కేంద్రానికి వాహనాల్లో తరలించారు.

ఓటింగ్‌కు టిడిపి నాయకులు దూరం

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌లో టిడిపికి చెందిన పలువురు ఎంపిటిసిలు, కౌన్సిలర్లు ఓటింగ్‌కు దూరంగా ఉన్నట్లు తెలిసింది. ప్రధానంగా ఆమదాలవలస నియోజకవర్గంలో 11 మంది ఎంపిటిసిలు ఓటింగ్‌కు వెళ్లలేదని సమాచారం. టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు, టెక్కలి ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు, ఇచ్ఛాపురం టిడిపి ఎమ్మెల్యే బెందాళం అశోక్ ఓటింగ్‌కు దూరంగా ఉన్నారు.

పోలింగ్‌లో కనిపించని హడావుడి

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌లో ఎక్కడా హడావుడి కనిపించలేదు. టిడిపి పోటీలో లేకపోవడంతో స్తబ్దుగానే పోలింగ్ సాగింది. పోలింగ్ కేంద్రాల్లో స్వతంత్ర అభ్యర్థి రామకృష్ణ తరుపున ఏజెంట్లు తప్ప వేరే వారు లేకపోవడంతో వైసిపికి పెద్దగా ఇబ్బందులు తలెత్తలేదు. పలు సందర్భాల్లో అభ్యంతరం తెలిపినా అధికారులు పట్టించుకోలేదని స్వతంత్ర అభ్యర్థి తరుపున ఏజెంట్లు ఆరోపించారు.

పలు కేంద్రాలను పరిశీలించిన అరుణ్‌కుమార్

స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ జరుగుతున్న తీరు, ఏర్పాట్లను ఎన్నికల పరిశీలకులు హనుమంతు అరుణ్‌కుమార్ పరిశీలించారు. పలాస తహశీల్దార్ కార్యాలయం కేంద్రం, టెక్కలి సబ్ కలెక్టర్ కార్యాలయం, పాలకొండ ఆర్‌డిఒ పోలింగ్ కేంద్రాలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ శ్రీకాకుళం ఆర్‌డిఒ కేంద్రాన్ని సందర్శించి ఎన్నికలు జరుగుతున్న తీరును పర్యవేక్షించారు.

వెబ్‌కాస్టింగ్‌లో పోలింగ్ సరళిని పరిశీలించిన జెసి నవీన్

కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన వెబ్‌కాస్టింగ్ ద్వారా జాయింట్ కలెక్టర్ నవీన్ పోలింగ్ సరళిని పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కంట్రోల్ రూమ్ ద్వారా ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించారు. శ్రీకాకుళం నగరంలోని పిఎస్‌ఎన్‌ఎంహెచ్ స్కూల్ పోలింగ్ కేంద్రాన్ని సందర్శించారు. పోలింగ్ ప్రక్రియ ముగిసిన అనంతరం బ్యాలెట్ బాక్సులను పటిష్ట పోలీసు బందోబస్తు మధ్య శ్రీకాకుళం నగరంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలోని స్ట్రాంగ్ రూమ్‌కు తరలించారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్, స్థానిక సంస్థల ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, జిల్లా రెవెన్యూ అధికారి రాజేశ్వరి, ఆర్‌డిఒ బి.శాంతి ఆధ్వర్యాన బ్యాలెట్ బాక్సులను స్ట్రాంగ్ రూంలో భద్రపరిచి వైసిపి ప్రతినిధి, స్వతంత్ర అభ్యర్థి రామకృష్ణ సమక్షంలో రూమ్‌కి సీల్ వేశారు.

ఓటు వేసిన ప్రముఖులు

స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం, రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు, ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ శ్రీకాకుళం నగరంలో ఆర్‌డిఒ కార్యాలయంలోని పోలింగ్ కేంద్రంలో ఓటు వేశారు.

పోలింగ్ కేంద్రం	మొత్తం ఓటర్లు	ఓటు వేసిన వారు	పోలింగ్ శాతం
శ్రీకాకుళం ఆర్‌డిఒ కార్యాలయం	249	233	93.57
పాలకొండ సబ్ కలెక్టరేట్	153	149	97.39
టెక్కలి సబ్ కలెక్టరేట్	162	161	99.38
పలాస తహశీల్దార్ కార్యాలయం	212	209	98.58
మొత్తం	776	752	96.91

ఓటు వేస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

డీవార్మింగ్ డేకు ఏర్పాట్లు పూర్తి

జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రాష్ట్రీయ బాల స్వాస్థ్య (ఆర్‌బిఎస్‌కె) కింద ఈనెల 14వ తేదీన నిర్వహించే జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం (నేషనల్ డీవార్మింగ్ డే) నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బొడ్డేపల్లి మీనాక్షి తెలిపారు. నగరంలోని వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలో 1 నుంచి 19 ఏళ్ల లోపు బాలబాలికలకు నులిపురుగుల నివారణకు అల్బెండాజోల్ మాత్రలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న ఈ మాత్రలు వేయించేందుకు తల్లిదండ్రులు శ్రద్ధ తీసుకోవాలన్నారు. నులిపురుగుల వల్ల రక్తహీనత వస్తుందన్నారు. అనారోగ్య సమస్యలకు కారణమవుతున్న నులిపురుగులను నివారించి ఆరోగ్యాన్ని మెరుగుపరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమంలో భాగంగా ఈనెల 14 వ తేదీన నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని నిర్వహిస్తోందన్నారు. మధ్యాహ్నం భోజనం అనంతరం అరగంట తర్వాత అల్బెండాజోల్ మాత్రలు పిల్లలకు ఇవ్వాలన్నారు. ఈ మాత్రల వల్ల ఎటువంటి దుష్ప్రభావాలు ఉండవని స్పష్టం చేశారు. జిల్లాలో 4,40,908 మంది పిల్లలకు నులిపురుగుల నివారణ కోసం అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసేందుకు లక్ష్యంగా నిర్దేశించినట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడిఒలు తమకు నిర్దేశించిన లాగిన్‌లో పొందుపరిచి పిల్లలందరికీ ఆయా పాఠశాలలు, కళాశాలల్లో ఎఎన్‌ఎం, ఆశా కార్యకర్తల ద్వారా పంపిణీకి చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. జిల్లాలోని 3,230 ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలు, 144 జూనియర్ కళాశాలలు, ఐటిఐ, పాలిటెక్నిక్, కళాశాలల్లోని విద్యార్థులకు మాత్రలు అందిస్తామన్నారు. 3,358 అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులకూ మాత్రలు పంపిణీ చేస్తామని చెప్పారు. గర్భిణులూ మాత్రలు వేసుకోవాలన్నారు. 1 నుంచి రెండేళ్ల చిన్నారులకు సగం మాత్ర (200 మిల్లీగ్రాములు)ను పొడిచేసి సులభంగా మింగగలిగేలా సురక్షితమైన నీటితో కలిపి ఇవ్వాలన్నారు. రెండు నుంచి 19 ఏళ్ల వారు ఒక మాత్రను చప్పరించి, నీటితో కలిపి మింగాలని తెలిపారు. మాత్ర వేసుకోని వారిని గుర్తించి ఈనెల 18వ తేదీన మాప్ అప్ కార్యక్రమం రోజున ఇవ్వనున్నట్లు చెప్పారు. సమావేశంలో అదనపు డిఎంహెచ్ఒ డాక్టర్ అనురాధ, శ్రీదేవి, కృష్ణమోహన్, డెమో పైడి వెంకటరమణ, ఇమ్యునైజేషన్ మేనేజర్ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మీనాక్షి

రేపు ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఈనెల 15వ తేదీన ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ తెలిపారు. ఆరోజు ఉదయం 10.30 గంటలకు కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఈ వేడుకలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. స్వచ్ఛమైన ఇంధన పరివర్తనం ద్వారా వినియోగదారులకు సాధికారత కల్పించడం అనే నినాదంతో ముందుకు తీసుకెళ్లనున్నట్లు తెలిపారు.

35 మంది విద్యార్థులకు అస్వస్థత

చికిత్సకు టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలింపు

వసతిగృహంలో వైద్యశిబిరం ఏర్పాటు

(మెయిన్ పేజీలో)

మున్సిపల్ ఆర్‌డిగా ఓబులేసు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

శ్రీకాకుళం నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసుకు మున్సిపల్ రీజనల్ డైరెక్టర్‌గా ఉద్యోగోన్నతి లభించింది. సెలక్షన్ గ్రేడ్ కమిషనర్‌గా ఉన్న ఆయనకు రీజనల్ డైరెక్టర్ కమ్ అప్పిలేట్ కమిషనర్‌గా ఉద్యోగోన్నతి కల్పిస్తూ మున్సిపల్ పరిపాలన శాఖ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా పలు మున్సిపాల్టీలు, పట్టణాభివృద్ధి సంస్థల్లో పనిచేస్తున్న ఏడుగురికి ప్రభుత్వం ఉద్యోగోన్నతి కల్పించింది. అందులో ఓబులేసు ఉన్నారు. ఆయన్ను శ్రీకాకుళం నగరపాలక సంస్థ కమిషనర్‌గానే కొనసాగిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది.

ఉద్యోగోన్నతి పొందిన ఆయన్ను లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ శ్రీకాకుళం ప్రతినిధులు ఆయన ఛాంబర్‌లో సోమవారం కలిసి అభినందనలు తెలిపారు. లయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ శ్రీకాకుళం అధ్యక్షులు హారిక ప్రసాద్ మాట్లాడుతూ ప్రజా సమస్యలతో పాటు కార్యాలయ ఉద్యోగుల, సిబ్బంది సమస్యలకు పరిష్కారం చూపడంలో ఓబులేసు ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారని కొనియాడారు. నగరాభివృద్ధికి విశేష కృషి చేస్తూ సుందర శ్రీకాకుళాన్ని తీర్చిదిద్దడంలో సఫలీకృతులయ్యారని చెప్పారు. స్వచ్ఛ భారత్‌లో భాగంగా జాతీయస్థాయి అవార్డు సాధించి సిక్కోలుకే వన్నె తెచ్చారని తెలిపారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ సెంట్రల్ శ్రీకాకుళం కార్యదర్శి ఆర్.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు పొన్నాడ రవికుమార్, జి.బి గాంధీ, రీజనల్ చైర్మన్ నటుకుల మోహన్, మాజీ అధ్యక్షులు బాడాన దేవభూషణరావు తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్‌ను అభినందిస్తున్న ప్రసాద్

సంగీత, నృత్య వార్షిక పరీక్షలకు నోటిఫికేషన్

శ్రీకాకుళం అర్బన్: హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం నిర్వహించే సంగీత, నృత్య వార్షిక పరీక్షలు సర్టిఫికేట్, డిప్లమో కోర్సులకు సంబంధించిన నోటిఫికేషన్ విడుదల చేసినట్లు విజయనగరం మహారాజ ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల ప్రిన్సిపాల్ ఎం.నాగలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. 2022-23 విద్యా సంవత్సరానికి వార్షిక పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు దరఖాస్తు ఫారాన్ని, నియమావళిని www.teluguuniversity.ac.in వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని నిర్ణీత రుసుం డిడి ద్వారా చెల్లించాలని పేర్కొన్నారు. పూర్తి చేసిన దరఖాస్తుతో పాటు చెల్లించిన డిడిని పరీక్ష రాసే కళాశాల, పాఠశాలల్లో సమర్పించాలని సూచించారు. విద్యార్థులు చెల్లించాల్సిన ఫీజు వివరాలు సంబంధిత వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు తెలిపారు. ఏదైనా జాతీయ బ్యాంకు నుంచి Registrar, P.S.Telugu University, Hyderabad పేరిట డిడిని పొందాలని పేర్కొన్నారు. ఈనెల 9 నుంచి ఏప్రిల్ 14వ తేదీ వరకు సాధారణ రుసుముతో, 24వ తేదీ వరకు అపరాధ రుసుముతో చెల్లించేందుకు అవకాశం ఉందని తెలిపారు. అంధ విద్యార్థులకు పరీక్ష ఫీజు నుంచి మినహాయింపు ఉంటుందని, వారు ధ్రువీకరణ పత్రం ప్రతిని జత చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను సంబంధిత పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్స్ ధ్రువీకరణతో ఏప్రిల్ 29 సాయంత్రం ఐదు గంటల్లోగా విశ్వవిద్యాలయానికి చేరేలా పంపించాలని తెలిపారు. ఆ తర్వాత అందిన దరఖాస్తులు స్వీకరించబోమని స్పష్టం చేశారు.

IN THE HONOURABLE COURT OF THE DISTRICT JUDGE AT SRIKAKULAM
IA.1483/22 IN TOP 17/2022
BETWEEN:
SADASIVUNI RAMAKRISHNA AND ANOTHER .... PETITIONERS
AND
CHALLA SURYANARAYANA AND 9 OTHERS ....RESPONDENTS
Notice to Respondent No.4
Challa Hatakesam, S/o Late Ramayya
Age 51 years, Hindu, Cultivation R/o D.No.2-238
Ambatiyerukuvanipeta Village, Ampolu Panchayat
Gara Mandalam, Srikakulam Dist.
NOTICE
పై నెంబరు Transfer Petition మరియు IA 1483/2022 in T.O.P. 17/2022 లో మీకు ఎన్నిసార్లు నోటీసులు పంపినా తీసుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీ జిల్లా కోర్ట్ వారి ఆర్డర్ ప్రకారం ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయడమైనది. సదరు పిటీషనుపై మీకు ఎటువంటి అభ్యంతరములు వున్నా స్వయంగా కాని, ప్లీడరుగారి ద్వారా గాని తే 23-03-2023 దిన ఉదయం గం॥ 10-30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట హాజరై తెలియజేయవలెను. లేనిచో మీ పరోక్షమున తీర్మానించుదురని తెలియజేయడమైనది.
N. Vijaya Kumar
V.S.Srinivasa Rao
A.Appalaraju
Advocates, Srikakulam

ప్రకటన
మహారాజశ్రీ విజయనగరం సీనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో
H.M.O.P. 43/2022
శ్రీమతి జామి (గుడ్ల) కావ్య .....పిటీషనరు
యదిరి :
శ్రీ జామి మధుసూదనరావు ....రెస్పాండెంటు
To
శ్రీ జామి మధుసూదనరావు, S/o వాసుదేవరావు, డోర్ నెం: 1-189, పెద్దవీధి, తండెంవలస గ్రామం, శ్రీకాకుళం జిల్లా - 532185.
పై నెంబరు గల కేసులో పిటీషనరు మీ పైన సెక్షను 13 (1) (100) 1 (b) హిందూ వివాహచట్టం ప్రకారం, మీతో వివాహ బంధం రద్దు చేస్తూ విడాకులు మంజూరు చేయవలసినదిగా కోరుచూ పై నెంబరు గల పిటీషను దాఖలు చేసి యున్నారు. ఇందు విషయమై మీకు ఆక్షేపణలున్న యెడల మీరు స్వయంగా కాని, వకీలు ద్వారా గాని తే 21-03-2023దిన ఉదయం గం॥ 10-30ని॥లకు పై కోర్టువారి యెదుట హాజరయ్యి ఇందుకు సంబంధించిన యావత్తు దస్తావేజులతో మీ వాదనకు సంబంధించిన స్టేట్‌మెంటు దాఖలు చేసుకొని వాదించుకోవలెను. లేని యెడల సదరు కేసును మీ పరోక్షమందు విచారించి తీర్మానించెదరని యిందుమూలముగా మీకు తెలియజేయడమైనది. కాగా ఇది కోర్టువారి ఉత్తర్వుల మేరకు ప్రకటించడమైనది.
ఇట్లు
వి.రత్నకుమారి
విజయనగరం
తే 13-03-2023
పిటీషనరు త॥ న్యాయవాది, విజయనగరం

ఆమదాలవలస : ఓటు వేసేందుకు బారులు తీరిన పట్టభద్రులు

నౌపడ : పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి

జలుమూరు: ఓటు వేసేందుకు లైన్‌లో ఉన్న ఓటర్లు

పోలాకి : సిరాను చూపిస్తున్న ఎమ్మెల్యే కృష్ణదాస్ దంపతులు

నందిగాం : పరిశీలిస్తున్న విజయమణికంఠ

పొందూరు : పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్‌పి రాధిక

ప్రశాంతంగా ఎమ్మెల్సీ ఎన్నికలు

సిరాను చూపిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గోవిందరావు

వజ్రపుకొత్తూరు : సిరా వేస్తున్న ఎన్నికల సిబ్బంది

కంచిలి : పోలింగ్ సరళిని అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే అశోక్

సిరాను చూపిస్తున్న ఎమ్మెల్యే అశోక్, చైర్‌పర్సన్ రాజ్యలక్ష్మి, కవలలు

పలాస : ఓటు వేస్తున్న జడ్జి రవిశంకర్, సిరా చూపిస్తున్న శిరీష

ఓటు వేస్తున్న విజయమాధవి, కూర్మారావుని వీల్‌చైర్‌పై తీసుకొస్తున్న పోలీసులు

కొత్తూరు : క్యూలో ఉన్న ఓటర్లు, ఓటు వేస్తున్న ఎమ్మెల్సీ శ్రీనివాస్

పొందూరు: పొందూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నాలుగు పోలింగ్ కేంద్రాల్లో నిర్వహించిన ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలో 2,583 మందికి గాను, 1,880 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. దీంతో 72.78శాతం పోలింగ్ నమోదైంది. ఇందులో 1,942 మంది పురుషులకు గాను 1,437 మంది, 641 మంది స్త్రీలుకు గానూ, 443 మంది ఓట్లు వేశారు. తహశీల్దార్ ఎస్.రాంబాబు ఉదయం నుంచే ప్రణాళికాబద్ధంగా ఎన్నికల ఏర్పాట్లను చేశారు. పోలింగ్ కేంద్రాల్లోకి ఓటర్లు సెల్‌ఫోన్లు, పెన్నులను తీసుకువెళ్లేందుకు అనుమతిని నిరాకరించారు.

ఎస్‌పి రాధిక పరిశీలన

ఎన్నికల పోలింగ్ కేంద్రాలను ఎస్‌పి జి.రాధిక పరిశీలించారు. ఎటువంటి అవాంచనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందుస్తుగా పటిష్టంగా పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు. ఈమె వెంట డిఎస్‌పి మహీంద్ర, సిఐ పి.పైడయ్య, ఎస్‌ఐలు ఎస్.లక్ష్మణరావు, ఎల్.లక్ష్మణరావు పాల్గొన్నారు.

ఎన్నికల కోలాహలం

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎన్నికలు నిర్వాహణతో తహశీల్దార్ కార్యాలయం ముందు జనసందోహంతో పండుగ వాతావరణాన్ని తలపించింది. ఎన్నడూ లేని విధంగా వివిధ పార్టీలకు చెందిన వారు తమ అభ్యర్థులకు మద్దతుగా గ్రామాల నుంచి పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు, తరలివచ్చారు. ఉదయం నుంచే అభ్యర్థులకు చెందిన వారు టెంట్లు, కుర్చీలు వేసి ఓటర్లకు స్లిప్‌లను పంపిణీ చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు పార్టీలు ఈ విధంగా ప్రాధాన్యతను ఇవ్వడం ఎన్నడూ చూడలేదంటూ పలువురు అంటున్నారు. ఈ ఎన్నికలే ఈ విధంగా ఉంటే... వచ్చే సాధారణ ఎన్నికలు తీవ్ర ఉత్కంఠత నెలకొంటుందంటూ పలువురు చర్చించుకుంటున్నారు.

ఆమదాలవలస : పట్టణంలోని జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఉన్న ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. 43, 43ఎలో సిబ్బంది ఏర్పాట్లు పూర్తి చేయడంతో ఆలస్యం కావడంతో ఎనిమిది గంటలకు ప్రారంభం కావాల్సిన పోలింగ్ అరగంట ఆలస్యంగా ప్రారంభమైంది. ఉదయం మందకొడిగా ప్రారంభమైన పోలింగ్ 10 గంటలు అయ్యేసరికి ఓటర్ల రాకతో రద్దీ పెరిగింది. 3,123 ఓట్లకు గాను, 2286 ఓట్లు పోలయ్యాయి. దీంతో 73 శాతం పోలింగ్ నమోదయ్యింది. జిల్లా జూడో సంఘం అధ్యక్షులు, వైసిపి నాయకులు చింతాడ రవికుమార్ 45వ నంబరు బూత్‌లో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎఆర్ఒ ఎస్.గణపతి, సిఐ పైడయ్య ఆధ్వర్యాన ఎస్‌ఐలు వై.కృష్ణ, రఘునాథరావు పర్యవేక్షణలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.

కొత్తూరు : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. సిఐ ఆర్.వేణుగోపాలరావు ఆధ్వర్యాన భద్రతా ఏర్పాట్లను నిర్వహించారు. తహశీల్దార్ పి.బాల పర్యవేక్షణలో సిబ్బంది విధులను నిర్వహించారు. ఈ పోలింగ్‌కు గతంలో ఎన్నడూ లేని విధంగా పట్టభద్రుల ఓటు వినియోగానికి తరలివచ్చారు. అయితే 1229 మందికి ఒకే పోలింగ్ బూతు ఏర్పాటు చేయడంతో ఓటర్లు గంటల తరబడి ఓటు కోసం క్యూలో నిల్చొన్నారు. ఆ సమయంలో టెక్కలి సబ్‌కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. పోలింగ్ నెమ్మదిగా సాగుతుండడంతో ఆయన ఆదేశాల మేరకు పక్క రూమ్‌లో రెండో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశారు. బ్యాలెట్ పేపరు పెద్దది కావడంతో దానికితగ్గ సిబ్బంది లేకపోవడంతో కాస్త ఇబ్బందులు పడ్డారు. 4 గంటల తరువాత ఓటర్లు క్యూలో ఉండడంతో సిబ్బంది ఓటింగ్‌ను కొనసాగింది. 229 ఓట్లకు గాను, 785 ఓట్లు పోలయ్యాయి. దీంతో 63 శాతం పోలింగ్ నమోదైంది. ఇందులో పురుషులు 587, మహిళలు 198 తమ ఓట్లను వినియోగించుకున్నారు. రాత్రి 7 గంటల వరకు పోలింగ్ నిర్వహించడంతో ఓటర్లు ఇబ్బందులు పడ్డారు.

కవిటి: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రశాంతంగా ముగిసింది. మొత్తం 1413 మంది ఓటర్లకు 1020 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. 72.18 శాతం ఓటింగ్ నమోదైంది. ఇచ్ఛాపురం సిఐ ఈశ్వర చంద్ర ప్రసాదరావు, కవిటి ఎస్ఐ కె.రాము పటిష్ట భద్రత కల్పించి పరిస్థితి సమీక్షించారు.

పోలాకి: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 49, 50 నంబరు గల రెండు పోలింగ్ కేంద్రాల్లో నిర్వహించిన ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఈ రెండు కేంద్రాల్లో మొత్తం 1472 ఓట్లు ఉండగా, 1132 పోలయ్యాయని, దీంతో 76.9 శాతం నమోదైందని ఎన్నికల అధికారులు సంతోష్, హనుమంతురావు తెలిపారు. ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, సతీమణి పద్మప్రియలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇందులో పురుషులు 792, మహిళలు 340 మంది తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు.

జి.సిగడాం : జి.సిగడాం ప్రాథమిక పాఠశాలలో పిఎస్ 42లో నిర్వహించిన ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక ప్రశాంతంగా ముగిసింది. మొత్తం 1245 ఓట్లకు గాను, 898 ఓట్లు పోలయ్యాయని ఎన్నికల అధికారి మధు తెలిపారు. దీంతో 72.12 శాతం పోలింగ్ నమోదైందన్నారు. రెవెన్యూ, ఆరోగ్య సిబ్బంది తమ సేవలను అందించారు. పెంట గ్రామానికి చెందిన పి.కూర్మారావుకి కాలుకు విరిగిపోవడంతో కట్టుతో పోలింగ్ కేంద్రానికి వచ్చారు. పోలింగ్ కేంద్రానికి పోలీసులు, ఆరోగ్య సిబ్బంది సహకారంతో తమ ఓటును వినియోగించుకున్నాడు.

బూర్జ : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎన్నికల పోలింగ్ 69.4 శాతం నమోదైందని ఎన్నికల అధికారి తెలిపారు. మొత్తం 1287 ఓటర్లకు గాను, 894 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని అన్నారు. ఎస్ఐ బి.అశోక్‌బాబు తన సిబ్బందితో పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు.

రణస్థలం రూరల్ : రణస్థలం జిల్లా పరిషత్ హైస్కూల్‌లోని రెండు పోలింగ్ నిర్వహించిన ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక ప్రశాంతంగా ముగిసింది. 1662 మందికి గాను, పురుషులు 929 మంది, మహిళలు 351 మంది తమ ఓట్లను వినియోగించుకున్నారు. ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్, ఎన్ఇఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ ఛైర్మన్ నడుకుదిటి ఈశ్వరరావు, తహశీల్దార్ ఎస్.కిరణ్ కుమార్ తమ ఓట్లను వినియోగించుకున్నారు. శ్రీకాకుళం డిఎస్‌పి మహేంద్ర పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. జె.ఆర్.పురం సిఐ అదాం, ఎస్ఐ జి.రాజేష్ పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు.

నరసన్నపేట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 46,47,48 పోలింగ్ బూత్‌ల్లో నిర్వహించిన పట్టభద్రులు ఎమ్మెల్సీ ఎన్నిక ప్రశాంతంగా ముగిసింది. 46లో 1231 ఓట్లకు గాను, 898, 47లో 593 ఓట్లకు గాను, 444, 48లో 605 ఓట్లకు గాను, 427 నమోదయ్యాయి. మొత్తం 2429 ఓట్లకు గాను, 1769 ఓట్లు పోలవ్వడంతో 72.82 శాతం నమోదైంది.

లావేరు : లావేరు జెడ్‌పి పాఠశాలలో నిర్వహించిన ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. 65లో పోలింగ్ బూత్ నంబరులో 1206 ఓట్లుకు గాను, 872 ఓట్లు పోలు కావడంతో 72.03 శాతం నమోదైంది. పురుషులు 644, మహిళలు 228 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ రాత్రి 7 గంటలు వరకు కొనసాగింది. పోలింగ్ కేంద్రంలో ఒకే గెట్ ఉండడంతో ఓటు వేసేందుకు వచ్చిన ఓటర్లు ఇబ్బందులకు గురయ్యారు. పోలింగ్ కేంద్రాన్ని తహశీల్దార్ దిలీప్ చక్రవర్తి పరిశీలించారు. ఎస్ఐ కోటేశ్వరరావు పోలీస్ బందోబస్తు నిర్వహించారు.

నందిగాం : నందిగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పోలింగ్ బూత్ వద్ద నిర్వహించిన ఉత్తరాంధ్ర పట్టభద్రుల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. మండలంలోని 1366 మంది ఓటర్లకు గాను, 887 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ కేంద్రాన్ని స్పెషల్ ఇన్విస్టిగేషన్ బ్యూరో ఎస్‌పి విజయమణి కంఠ, ఆర్‌డిఒ టి.సీతారామ్మూర్తి, తహశీల్దార్ భాగ్యలక్ష్మి, పోలింగ్ అధికారి బి.వెంకటరావు పరిశీలించారు. ఎస్ఐ మహమ్మద్ అలీ ఆధ్వర్యాన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

సరుబుజ్జిలి : సరుబుజ్జిలిలో నిర్వహించిన ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక ఉదయం ఎనిమిది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు సజావుగా సాగింది. పోలింగ్‌స్టేషన్ 36లో 1022 మంది ఓటర్లకు గాను, 726 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇందులో పురుషులు 518, మహిళలు 208 మంది ఉన్నారు. దీంతో 71 శాతం నమోదయ్యింది. జోనల్ ఆఫీసర్ పద్మనాభం ఎన్నికల కేంద్రాన్ని పరిశీలించారు. ఎస్ఐ కృష్ణప్రసాద్ ఆధ్వర్యాన పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

జలుమూరు: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం నిర్వహించిన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ 69.71శాతం నమోదైనట్లు తహశీల్దార్ బి.సత్యం తెలిపారు. మండలంలో 1,040 ఓట్లు ఉండగా పురుషులు 542 మంది, మహిళలు 183 మంది, మొత్తం 725 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. సాయంత్రం 4గంటలకు పోలింగ్ ముగిసే సమయానికి ఓటర్లు లైనులో ఉండగా వారికి టోకెన్లను అందజేసి, ఓటు హక్కు కల్పించారు. తహశీల్దార్ బి.సత్యం, ఎంపిడిఒ జి.వి.రవికుమార్ ఎన్నికలను పర్యవేక్షించారు. ఎస్ఐ పారినాయుడు తన సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

వజ్రపుకొత్తూరు: స్థానిక ఎంపిపి పాఠశాలలో ఏర్పాటు చేసిన ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని జోనల్ ఆఫీసర్ మట్ట రవికృష్ణ సందర్శించి, పోలింగ్ తీరును పరిశీలించారు. 4గంటలకు పోలింగ్ సమయం ముగియడంతో లైనులో ఉన్న వారికి టోకెన్లు ఇచ్చి, ఓటు హక్కు కల్పించారు. మొత్తం 734 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఆలస్యంగా వచ్చిన వారికి పోలీసులు ఓటు వేసేందుకు అనుమతించలేదు.

75.17 శాతం పోలింగ్

ఇచ్ఛాపురం: మున్సిపల్ పాఠశాలలో రెండు పోలింగ్ బూతుల్లో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నిర్వహించారు. 1446 మంది ఓటర్లకు 1087 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 75.17శాతం పోలింగ్ నమోదైంది. మున్సిపల్ చైర్‌పర్సన్ రాజ్యలక్ష్మి, తహశీల్దార్ గురుప్రసాద్, డిటి శ్రీహరి ఓటు వేశారు. డిఎస్‌పి శివరామిరెడ్డి పోలింగ్ సరళిని పరిశీలించారు.

పంజా వీధిలో పోలింగ్ కేంద్రం కేటాయించడంతో దానంపేట టిడిపి, వైసిపి, బిజెపి, ప్రజాసంఘాలు పోటాపోటీగా శిబిరాలు నిర్వహించారు. వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజ్ పోలింగ్ నిర్వహణను పరిశీలించారు. ఓటర్లకు ఫోన్ చేసి, ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరడం విశేషం. టిడిపి నేతలు కె.ధర్మారావు, సాలీనా ఢిల్లీ యాదవ్, కె.జయదేవ్, తదితరులు ఓటర్లను పోలింగ్‌లో పాల్గొనేలా చర్యలు తీసుకున్నారు.

కోటబొమ్మాళి: మండల కేంద్రంలోని జెడ్‌పి బాలుర పాఠశాలలో నిర్వహించిన పట్టభద్రుల ఎమ్మెల్సీ పోలింగ్‌లో 34, 35 పోలింగ్ స్టేషన్లలో 1643 మందికి 1199 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 73.5శాతం పోలింగ్ జరిగిందని తహశీల్దార్ జామి ఈశ్వరమ్మ తెలిపారు. పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్లు తాగేందుకు మంచినీటి సదుపాయం కల్పించలేదని పట్టభద్రుల ఓటర్లు అవేదన వ్యక్తం చేశారు. టెక్కలి జెడ్‌పిటిసి దువ్వాడ వాణి పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి ఓటర్లకు సౌకర్యం కల్పించకపోవడంపై తహశీల్దార్‌ను నిలదీశారు. సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి, సిఐ సూర్యచంద్రమౌళి పోలింగ్ కేంద్రాన్ని సందర్శించారు. అచ్చెన్నాయుడు సతీమణి విజయ మాధవి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.

కంచిలి: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా జెడ్‌పి ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పోలింగ్‌లో 725 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 75.5శాతం పోలింగ్ నమోదైంది. ఎమ్మెల్యే అశోక్, మాజీ ఎమ్మెల్యే సాయిరాజ్ శిబిరాలను సందర్శించి ఓటింగ్ సరళి గురించి అడిగి తెలుసుకున్నారు.

మెళియాపుట్టి: మండలంలోని చాపర ఉన్నత పాఠశాలలో సోమవారం జరిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. 852 మందికి 646మంది ఓటు వేశారు. 75.82 శాతం ఓటింగ్ జరిగినట్లు తహశీల్దార్ సరోజని తెలిపారు.

పలాస: పలాస జూనియర్ కళాశాల, పలాస ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో సోమవారం జరిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో 76 శాతం ఓట్లు పోలయ్యాయి. పలాస మండలంలో 8, 9,10 పోలింగ్ కేంద్రాల్లో 2497 ఓట్లకు 1909 మంది ఓట్లు వేశారు. పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్సులను ఏజెంట్లు సమక్షంలో సీజ్ చేశారు. అనంతరం వాటిని శ్రీకాకుళం పాలిటెక్నిక్ కళాశాలకు తరలించినట్లు పలాస ఆర్‌డిఒ టి. సీతారామ్మూర్తి, తహశీల్దార్ ఎల్ మధుసూదనరావు తెలిపారు.

ఓట్లు ప్రకటించడంలో తర్జనభర్జన

పలాస 9 పోలింగ్ కేంద్రంలో 617 ఓట్లు కాగా ముందుగా 478 ఓట్లు పోలు అయినట్లు అధికారులు వెల్లడించారు. ఓట్లకు బ్యాలెట్ పేపర్లు తేడా రావడంతో అధికారులు సుమారు గంట పాటు తర్జనభర్జనపడ్డారు. చివరకు 484 ఓట్లు పోలు అయినట్లు అధికారులు ప్రకటించారు.

నౌపడ: సంతబొమ్మాళి మండలంలో పట్టుభద్రుల ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. సంతబొమ్మాళి మండలంలో 1067 మంది ఓటర్లు ఉండగా 794 మంది ఓటు హక్కును వినియోగించుకున్నట్లు పిఒ రాము తెలిపారు. సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు.

టెక్కలి రూరల్: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ స్థానిక ఆదర్శ పాఠశాలలో నిర్వహించారు. రెండు పోలింగ్ గదుల్లో 2258 మందికి 1596 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 71శాతం పోలింగ్ జరిగింది. ఎఎస్‌పి మణికంఠ, సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి పోలింగ్ తీరును పరిశీలించారు. స్వతంత్ర అభ్యర్థి నాయుడుగారి రాజశేఖర్ పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి పోలింగ్ తీరుని పరిశీలించారు. జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, టెక్కలి జెడ్‌పిటిసి దువ్వాడ వాణి, ఎంపిపి ఆట్ల సరోజనమ్మ పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి, పోలింగ్ తీరుని పరిశీలించారు.

ఓటు లేదనడంతో వాగ్వాదం

30వ పోలింగ్ కేంద్రంలో 160 సీరియల్ నెంబరు కలిగిన కుమ్మరి వెంకటరావు ఓటు వేసేందుకు వచ్చారు. ఆయన ఓటును వినియోగించుకున్నారని ఏజెంట్ అభ్యంతరం చెప్పారు. దీంతో వెంకటరావు పోలింగ్ సిబ్బందిని ప్రశ్నించారు. అక్కడున్న పిఒ నారాయణమూర్తి పరిశీలించారు. రికార్డు ప్రకారం వెంకటరావుకు ఓటు ఇవ్వడం జరగదని నిర్ధారించి, సమస్యను సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన చొరవతో మరలా వెంకటరావుకు ఓటు హక్కు కల్పించారు. మహిళా ఓటర్లకు ప్రత్యేక మార్గం లేకపోవడంతో ఇబ్బంది పడ్డారు.

ఓటు వేసిన ప్రముఖులు

ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఉన్నత పాఠశాలలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పలాస సివిల్ జడ్జి రవిశంకర్ దంపతులు, మంత్రి సీదిరి అప్పలరాజు, మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష, యార్లగడ్డ వెంకన్న చౌదరి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబురావు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మంత్రి సతీమణి శ్రీదేవి వజ్రపుకొత్తూరులో ఓటు వేశారు. జలుమూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మాజీ ఎమ్మెల్యే బగ్గు లక్ష్మణరావు తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.

టెక్కలి ఆదర్శ పాఠశాల్లో నిర్వహించిన పోలింగ్ కేంద్రంలో ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, కేంద్ర మాజీ మంత్రి కృపారాణి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

పోలీస్‌స్టేషన్ వద్ద దువ్వాడ ధర్నా / 8 మందిపై అట్రాసిటీ కేసు నమోదు

ప్రజాశక్తి- సంతబొమ్మాళి, నౌపడా

టిడిపి చెందిన ఏడుగురిని అరెస్ట్ చేయాలని కోరుతూ ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, వైసిపి నాయకులు సంతబొమ్మాళి పోలీస్ స్టేషన్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. వివరాల్లోకి వెళ్తే.. ఇజ్జువరం గ్రామానికి చెందిన మహిళ 3.58 నిమిషాలకు ఎమ్మెల్సీ ఓటు వేయడానికి వచ్చింది. ఆమెకు స్థానిక ఎస్ఐ కె.మధుసూదనరావు ఓటు వేయడానికి లోనికి పంపించారు. అక్కడే ఉన్న కొంతమంది టిడిపి కార్యకర్తలు సమయం అయిపోయిన తరువాత లోనికి ఎలా పంపిస్తారని ఎస్ఐను అడిగారు. పక్కనే ఉన్న వైసిపికి చెందిన ఎంపిపి ప్రతినిధి మేరుగు అప్పారావు, తన అనుచరులు కలుగజేసుకోవడంతో మాటామాటా పెరిగి ఇరు గ్రూపుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌తో పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. వెంటనే టిడిపి నేతలను అరెస్టు చేస్తేగానీ ఇక్కడి నుంచి వెళ్లేది లేదని పోలీస్ స్టేషన్ ముందు వైసిపి కార్యకర్తలతో కలిసి బైఠాయించారు. టిడిపికి చెందిన కూచెట్టి కాంతారావు, అల్లు రమేష్, అప్పిని వెంకటేష్, సూరాడ దాసురాజు, మెండ అప్పారావు, కల్లాడ శివ, చల్ల జగ్గారావు తనను కులం పేరుతో దూషించారని కూరాకుల అప్పారావు తెలిపారు. వీరిపై తక్షణమే అట్రాసిటీ కేసు పెట్టాలని డిఎస్‌పి శివరామిరెడ్డిని డిమాండ్ చేశారు. రాత్రి 8.30 గంటల వరకు పోలీస్ స్టేషన్ వద్ద కూర్చొని, నినాదాలు చేశారు. కార్యక్రమంలో టెక్కలి జెడ్‌పిటిసి దువ్వాడ వాణి, పిఎసిఎస్ చైర్మన్ కెల్లి జగన్నాయకులు, పాల వసంతరెడ్డి, మేరుగు అప్పారావు, బీమారావు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్ వద్ద బైఠాయించిన దువ్వాడ, వైసిపి నాయకులు

8 మందిపై అట్రాసిటీ కేసు

వైసిపికి చెందిన కూరాకుల అప్పారావును టిడిపికి చెందిన ఎనిమిది మంది కులం పేరుతో దూషించారన్న ఫిర్యాదు మేరకు వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు కాశీబుగ్గ డిఎస్‌పి శివరామిరెడ్డి తెలిపారు. దర్యాప్తు చేస్తామని చెప్పారు. దీంతో వైసిపి నాయకులు ధర్నా విరమించి, వెనుతిరిగారు.

బెస్ట్ సెట్టర్‌గా బహుమతి అందుకుంటున్న అభిరామ్

హోరాహోరీగా వాలీబాల్ పోటీలు

కవిటి: మండలంలోని బైరిపురంలో రెండు రోజులపాటు నిర్వహించిన రాష్ట్రస్థాయి ఆహ్వానిత వాలీబాల్ పోటీల్లో అత్యద్భుత ప్రతిభ కనబరిచిన కృష్ణా జిల్లా జట్టు ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది. తుది పోరులో హోరాహోరీగా పోరాడిన విజయనగరం జట్టు ద్వితీయ స్థానం సాధించింది. శ్రీకాకుళం, విశాఖపట్నం జట్లు మూడు, నాలుగు స్థానాల్లో నిలిచాయి. ఈ పోటీల్లో ఉత్తమ సెట్టర్‌గా శ్రీకాకుళం జట్టుకు చెందిన బడ్డ అభిరామ్, ఉత్తమ లిబ్రోగా విశాఖపట్నం జట్టుకు చెందిన త్రినాథ్, ఉత్తమ ఎటాకర్‌గా కృష్ణా జిల్లా జట్టుకు చెందిన కళ్యాణ్, ఉత్తమ ఆల్ రౌండర్‌గా విజయనగరం జట్టుకు చెందిన పవన్, ఉత్తమ ఆటగాడిగా కృష్ణా జిల్లా జట్టుకు చెందిన మల్లికార్జున్ ఎంపికయ్యారు. కార్యక్రమంలో ఎంపీ రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే బెందాలం అశోక్, వైద్యుడు డాక్టర్ ప్రధాన శివాజీ, వెయిట్ లిఫ్టింగ్ కామన్ వెల్త్ క్రీడాకారి పూజారి శైలజ, హెచ్‌ఆర్‌సిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ బి.దేవభూషణరావు, హెచ్‌ఆర్‌సిఐ రాష్ట్ర కో-ఆర్డినేటర్, జీడి గ్రూప్ సిఇఒ గొండ్యాల దుర్గాప్రసాద్, పుల్లట తారకేశ్వరమ్మ, గున్న జానకిరామయ్య, పుళ్లట రామ్‌కుమార్, ఎలమంచి నీలయ్య, పుల్లట జగదీష్, డాక్టర్ అనురాధ, బెందాలం రామ్ ప్రసాద్, సనపల శ్రీను, దేవేంద్ర పాల్గొన్నారు.

27న సొసైటీ సర్వజన సమావేశం

పోలాకి: మండల కేంద్రంలోని పిఎసిఎస్‌లో ఈ నెల 27న సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు డిసిసిబి చైర్మన్ కె.రాజేశ్వరరావు తెలిపారు. సోమవారం సొసైటీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 27న ఉదయం 10గంటలకు సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సమావేశానికి సొసైటీ కార్యవర్గ సభ్యులు, డైరెక్టర్‌లు, రైతులు, అధికారులు హాజరు కావాలని కోరారు. ఆయనతో పాటు సొసైటీ సిఇఒ బి.రాంబాబు పాల్గొన్నారు.

'స్థానిక' ఎమ్మెల్సీ పోలింగ్ ప్రశాంతం

ప్రజాశక్తి- పలాస

పలాస తహశీల్దార్ కార్యాలయంలో 'స్థానిక' ఎమ్మెల్సీ ఎన్నికలు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. పలాస డివిజన్ పరిధిలో 212 మంది ఓటర్లు ఉండగా సాయంత్రం 4గంటలు ముగిసేసరికి 209 ఓట్లు పోలయ్యాయి. అందులో 117 మంది స్త్రీలు, 92 మంది పురుషులు ఉన్నారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయంలోని పోలింగ్ కేంద్రాన్ని రాష్ట్ర ఎన్నికల పరిశీలకులు అరుణ్‌కుమార్, పలాస ఆర్‌డిఒ టి.సీతారామ్మూర్తి పరిశీలించారు.

టెక్కలి : ఓటు హక్కు వినియోగించుకున్న రెడ్డి శాంతి

రాష్ట్ర పశుసంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు తన ఓటును వినియోగించుకున్నారు. అనంతరం బ్యాలెట్ బాక్సుకు సీల్ వేసి ప్రత్యేక వాహనంలో శ్రీకాకుళం పాలిటెక్నిక్ కళాశాలకు తరలించినట్లు ఆర్‌డిఒ తెలిపారు. ఆయనతో పాటు ఎంపిడిఒ రమేష్‌నాయుడు, తహశీల్దార్ మధుసూదన్‌రావు, డిటి లక్ష్మీనారాయణ ఉన్నారు.

ఓటు వేయని అచ్చెన్న, ఎమ్మెల్యే అశోక్

టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ ఓటు హక్కును వినియోగించుకోలేదు. టిడిపి అభ్యర్థి బరిలో లేనందున వీరు ఓటుకు దూరంగా ఉన్నారని తెలిసింది. అలాగే ఇచ్ఛాపురం మున్సిపాలిటీ 15వ వార్డ్ కౌన్సిలర్ పిలక ఈశ్వరి, సోంపేట మండలం కొర్లాం ఎంపిటిసి సభ్యులు ఆర్.లీలావతి ఓటు వేయలేదు.

ఓటు వేసిన రెడ్డి శాంతి

టెక్కలి: టెక్కలి సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగిన స్థానిక ఎన్నికల్లో 162 ఓట్లకు 161 ఓట్లు పోలయ్యాయి. ఒక్క ఓటు పోలవ్వలేదు. పోలింగ్ కేంద్రాన్ని ఎన్నికల అధికారి ఎం.శ్రీకాంత్, రాష్ట్ర ఎన్నికల పరిశీలకులు హెచ్.అరుణ్‌కుమార్, సబ్‌కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి పరిశీలించారు.

ఓటు వేసిన ప్రముఖులు

పలాస తహశీల్దార్ కార్యాలయంలో మంత్రి సీదిరి అప్పలరాజు తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. టెక్కలి సబ్ కలెక్టర్ కార్యాలయంలో పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.

విద్యార్థులు ఆరోగ్యంగా ఉన్నారు

కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం

టెక్కలి మండలం పోలవరంలోని ప్రభుత్వ వెనుకబడిన తరగతుల వసతిగృహ విద్యార్థులు ఆరోగ్యం నిలకడగా ఉందని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ తెలిపారు. సోమవారం ఉదయం ఎనిమిది గంటలకు 13 మంది వసతిగృహ విద్యార్థులు అల్పాహారానికి ముందు వాంతులు, విరేచనాలతో బాధపతున్నట్లు తెలిసి వసతిగృహ అధికారి ఆ విద్యార్థులను టెక్కలిలోని జిల్లా ఆస్పత్రిలో చేర్పించారని చెప్పారు. వసతిగృహంలో చాకిపల్లి కొత్తూరు పి హెచ్‌సి వైద్యాధికారి, స్టాఫ్ నర్సు, సిబ్బంది పరవేక్షణలో మెరుగైన చికిత్స అందజేస్తున్నట్లు తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి వసతిగృహాన్ని సందర్శించారు. 16 మంది విద్యార్థులను టెక్కలిలోని జిల్లా కేంద్రాస్పత్రిలో చేర్పించి వైద్యం అందించారు. డిప్యూటీ డిఎంహెచ్, తహశీల్దార్ కేంద్రాస్పత్రిలోని విద్యార్థులను పరామర్శించారు. విద్యార్థులను వైద్యుల పర్యవేక్షణలో ఉంచి మంగళవారం ఉదయం తిరిగి వసతిగృహానికి పంపనున్నట్లు తెలిపారు.

అన్నదానంలో పాల్గొన్న యాత్రికులు

పారాపురంలో అన్నదానం

కొత్తూరు : మండలంలోని పారాపురంలో షిరిడిసాయి ఆలయంలో సుబ్రహ్మణ్యం శర్మ ఆధ్వర్యాన సుబ్రమణ్యస్వామి దివ్య సోమవారం ప్రతిష్ఠించారు. ఇందులో భాగంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పరిసర గ్రామాల నుంచి సుమారు ఐదు వేల మంది యాత్రికులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఉన్న ప్రదీప్, గ్రంథాలయ జిల్లా మాజీ చైర్మన్ తోట నందకుమార్, టి.కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్ : చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న అభిమానులు

'ఆస్కార్' విజయోత్సవ సంబరాలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఆర్ఆర్ఆర్ చిత్రంలోని నాటునాటు పాటకు ఆస్కార్ అవార్డు దక్కడంతో రామచరణ్, మెగా ఫ్యామిలీ అభిమానులు నగరంలోని సూర్యమహల్ కూడలిలో సోమవారం విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. ఈ వేడుకల్లో అఖిలభారత చిరంజీవి యువత వర్కింగ్ ప్రెసిడెంట్ తైక్వాండో శ్రీను ఆధ్వర్యాన తీన్‌మార్ డప్పులతో పాటు బాణసంచా కాలుస్తూ... సందడి చేశారు. రామ్ చరణ్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. కేక్‌ను కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆర్ఆర్ఆర్‌లోని నాటు నాటు పాటకి ఆస్కార్ వరించడం తెలుగువారందరికీ గర్వకారణమన్నారు. కార్యక్రమంలో చిరంజీవి, రాంచరణ్ అభిమానులు వైశ్యరాజు మోహన్, గౌతమ్, హరీష్, గోవింద్ సాయి మోహన్, హేమంత్ పాల్గొన్నారు.

టెక్కలి : ప్రపంచ దేశాల్లో తెలుగు సినిమాకి పట్టం కట్టిన తెలుగు పాట ఎన్నటికీ గుర్తుండిపోయే విధంగా కీర్తిని చాటుకుందని స్థానిక సుదర్శన థియేటర్ సినిమా హాల్ యజమాని సత్తారు వెంకటరమణ అన్నారు. ఆస్కార్ అవార్డుకి ఆర్ఆర్ఆర్ సినిమాలోని నాటు నాటు పాట ఎంపిక కావడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు సినిమా హాల్ వద్ద పోస్టర్‌కు పూలమాలలు వేసి మిఠాయిలు పంచి పెట్టారు. తెలుగు సినిమా స్థాయి ఏమిటో ప్రపంచం అంతా తెలియజెప్పిన బృందానికి, దర్శకుని ప్రతిభని ప్రశంసించారు. థియేటర్ మేనేజర్ బాల, రామకృష్ణ, వెంకటేష్, తరుణ్, సింహాచలం, జానీ హర్షం వ్యక్తం చేశారు.

పరామర్శిస్తున్న గౌతు శిరీష

గౌతు శిరీష పరామర్శ

మందస : మండలంలో హంసరాళి పంచాయతీ టిడిపి నాయకుడు, మాజీ సర్పంచ్ తమిరియ భాస్కరరావు అనారోగ్యంతో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష సోమవారం భాస్కరరావు ఇంటికి వెళ్లి అతని ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అధైర్య పడవద్దని, అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. ఆమెతో పాటు టిడిపి నియోజకవర్గ నాయకులు యార్లగడ్డ వెంకన్న చౌదరి ఉన్నారు.

శోభాయమానంగా జలయాత్ర

ప్రజాశక్తి - కవిటి

బాహుదా నది నుంచి నీటిని తీసుకొస్తున్న మహిళలు

మండలంలోని డి.గొనపపుట్టుగ గ్రామంలో శ్రీ గల్లాసుని అమ్మవారి ఆలయ పున: ప్రతిష్ఠ మహోత్సవం సోమవారం వైభవోపేతంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు జరగనున్న ఈ వేడుకల్లో భాగంగా పండితులు అరసవెల్లి భాస్కరశర్మ ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన సుమారు 600మంది మహిళలు బాహుదా నది నుంచి కళశాలతో పవిత్ర జలాలు తీసుకొచ్చి పూజా కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం జరిగిన సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా విశాఖకు చెందిన రేడియో అండ్ టివి ఆర్టిస్ట్ శ్రీ బొంతలకోటి యతిరాజ్ భాగవతార్ హరికథ గానామృతం అలరించింది.

మదనాపురంలో పులి కలకలం

గంట్యాడ : మండలంలోని మదనాపురం గ్రామ శివారులో గేదె దూడపై పులి దాడి చేసి హతమార్చింది. సోమవారం ఈ విషయం వెలుగు చూసింది. పులి దాడిలో గ్రామానికి చెందిన వర్రి శ్రీనుకు చెందిన గేదె దూడ మృతిచెందింది. దూడ కళేబరం ఉన్న ప్రదేశంలో పాదముద్రలు పులివిగా అనుమానించి అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. అటవీశాఖ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకొని పులి పాద ముద్రలుగా నిర్ధారించారు. పులి దాడి కారణంగానే గేదె దూడ మృతి చెందినట్లు తేల్చారు.

ఇంటర్ స్టేట్ యూత్ రెడ్‌క్రాస్‌కు జిల్లా విద్యార్థులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

విద్యార్థులను అభినందిస్తున్న జగన్మోహనరావు

హర్యానా రాష్ట్రంలోని కురుక్షేత్రలో ఈ నెల 16 నుంచి 21 వరకు యూత్ రెడ్‌క్రాస్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చైర్మన్ పి.జగన్మోహనరావు సోమవారం తెలిపారు. ఇంటర్ స్టేట్ యూత్ రెడ్‌క్రాస్ కార్యక్రమంలో పాల్గొనేందుకు జిల్లాలోని కాకినాడ ఆదిత్య, శివానీ ఫార్మసీ కళాశాలల విద్యార్థులు బయలుదేరారన్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి యూత్ రెడ్‌క్రాస్ విద్యార్థులు ఈ కార్యక్రమానికి హాజరు కానున్నట్టు తెలిపారు. రాష్ట్ర రెడ్‌క్రాస్ తరపున జిల్లా విద్యార్థులు హాజరు కానున్నట్టు చెప్పారు. ఆంధ్రప్రదేశ్ ప్రాముఖ్యత సంప్రదాయాలు ఇతర అంశాలపై అక్కడ యూత్ రెడ్‌క్రాస్ విద్యార్థులు ప్రెజెంటేషన్ ఇవ్వనున్నట్టు తెలిపారు. అందులో జిల్లా ప్రాధాన్యత ఉంటుందన్నారు. కార్యక్రమంలో వైద్యులు కొంచాడ సోమేశ్వరరావు, కొంక్యాన మురళి, రెడ్‌క్రాస్ సభ్యులు బి.చిన్మయిరావు, కో-ఆర్డినేటర్ కె.సత్యనారాయణ, క్యాంప్ కౌన్సిలర్ జి.శ్రీనివాస్, కె.ధర్మేంద్ర, జి.వెంకటరమణ, ఎ.వంశీరామ్, బి.అభిరామ్ పాల్గొన్నారు.

సాధికారత దిశగా స్వయంశక్తి సంఘాలు

ఎపిఎం కూర్మారావు

ఆమదాలవలస : గ్రామీణ ప్రాంతంలో స్వయం శక్తి సంఘాలు తమంతట తామే సమావేశాలు నిర్వహించుకోవడం, సమిష్టి నిర్ణయాలు తీసుకోగలగడం, పుస్తక నిర్వహణ, జవాబుదారీతనం పెంపొందించుకుని సాధికారత దిశగా అడుగులు వేస్తున్నారని వైఎస్ఆర్ క్రాంతి పథం అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు తెలిపారు. మండలంలోని వంజంగిపేట గ్రామ సంఘాల సభ్యులు సోమవారం సమావేశం స్వంతంగా నిర్వహించారని అన్నారు. గ్రామ సంఘం సమావేశం సిబ్బంది సహకారం ఆశించకుండా తమంతట తామే ఐకమత్యంగా నిర్వహించుకుంటున్నారని తెలిపారు. స్త్రీనిధి రుణాలను రీపేమెంట్ చేసుకొని విఓఎ సహకారంతో ఆన్‌లైన్‌లో పొందుపర్చుకున్నట్లు వివరించారు. ఆర్థిక,

సమావేశం నిర్వహిస్తున్న సంఘ సభ్యులు

సామాజిక అంశాలైన పారిశుధ్యం, మహిళా ఆరోగ్యం, బాలికా విద్యను ప్రోత్సహించడం, బాల్యవివాహాల నిర్మూలనపై మహిళలందరికీ అవగాహన కల్పించుకుని మహిళా సాధికారిత దిశగా ప్రయాణిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో విఓఎ చంద్రకళ, గ్రామ సంఘం ప్రతినిధులు, స్వయం శక్తి సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

అవగాహనా ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

ప్రకృతి వ్యవసాయం ముద్దు

ప్రజాశక్తి- ఆమదాలవలస

ప్రకృతి వ్యవసాయం చేసి నేలతల్లిని కాపాడుకుందామని ప్రకృతి వ్యవసాయ మండలి యాంకర్ నక్క చిరంజీవిరావు అన్నారు. మండలంలోని కొత్తవలసలో సోమవారం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు 30 రకాల విత్తనాలను నేలలో వేసుకోవడం వల్ల పంటలకు అవసరమైన సూక్ష్మజీవులు వ్యవస్థ అభివృద్ధి చెంది నేల సారవంతంగా మారుతుందని తెలిపారు. కార్బన్ శాతం పెరిగి భూమిలో జీవవైవిద్యం పెరుగుతుందన్నారు. ప్రస్తుతం ప్రకృతి వ్యవసాయం చేయడం ముఖ్యమన్నారు. రైతులందరూ రసాయన వ్యవసాయాలు వదిలి పూర్తిగా ప్రకృతి సేద్యంలో పంటలు పండించడం వల్ల నేల ఆరోగ్యాన్ని, మానవాళికి విషతుల్యం లేని ఆహారాన్ని అందించాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సురేష్, తిరుపతిరావు, లక్ష్మి, కృష్ణవేణి, రైతులు నక్క తవుడుబాబు, జనార్ధనరావు పాల్గొన్నారు.

క్షణక్షణం.. భయం భయం

ప్రజాశక్తి- వీరఘట్టం

విజయనగరం జిల్లా వంగర మండలం నుండి గత నెల 17వ తేదీన పార్వతీపురం మన్యం జిల్లా వీరఘట్టం మండలం పరిధిలోని కిమ్మీ, నడుకూరు గ్రామాల సరిహద్దుల్లోకి ఏనుగుల గుంపు ప్రవేశించి అక్కడ తిష్ట వేశాయి. అప్పటి నుండి కొట్టుగుమ్మడ, చిట్టపూడి వలస గ్రామాల సరిహద్దుల్లో సంచరించి చెరుకు, మొక్కజొన్న, కొబ్బరి చెట్ల నాశనంతో పాటు ధాన్యం బస్తాలు కూడా ధ్వంసం చేయడంతో అన్నదాతలు, ప్రజలు అనుక్షణం భయంతో కాలం వెల్లదీస్తున్నారు. గ్రామానికి సమీపంలో ఏనుగుల గుంపు సంచరించటం వల్ల ఏ సమయంలోనైనా గ్రామాన్ని చుట్టు ముడతాయేమోనని రాత్రంతా కంటి మీద కునుకు లేకుండా కాలం వెల్లదీస్తున్నారు.

పొలంలోకి వెళ్లాలంటేనే భయం

ఏనుగులు గుంపు కారణంగా బోరు బావుల ద్వారా పంట పొలాలకు నీరు కట్టేందుకు కూడా వెళ్లలేక పోతున్నామని, నీరు లేక ఎండుతున్న పంటలు, ఏనుగులు సంచార కారణంగా నాశనం అవుతున్న పంటల వల్ల తీవ్రంగా నష్టపోతున్నట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల 4న కిమ్మి గ్రామ సరిహద్దుకు ఏనుగుల గుంపు చేరాయి. ఏనుగులు దాహార్తిని తీర్చేందుకు నీరు లేకపోవడంతో అవి ఇదే గ్రామానికి చెందిన రౌతు పోలినాయుడు, గవర గంగు నాయుడు, బి. అసిరి నాయుడులకు చెందిన బోరు బావుల పైపులను ధ్వంసం చేశాయి. పక్కనే ఉన్న మొక్కజొన్న పంటలు కూడా నాశనం చేసినట్లు రైతులు చెబుతున్నారు. ఈ నెల ఒకటిన విక్రంపురం గ్రామానికి చెందిన మాచర్ల రాజు కిమ్మి గ్రామం వెళ్లి తిరిగి రాత్రి 10గంటల సమయంలో స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై వెళుతుండగా మార్గం మధ్యలో ఏనుగులు గుంపు ప్రధాన రహదారికి అడ్డంగా ఉండటాన్ని గమనించి ప్రాణ భయంతో ద్విచక్ర వాహనం విడిచి అక్కడి నుంచి పారిపోయాడు. ఇటువంటి ఘటనలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై మండిపడుతున్నారు.

హామీలు హుళక్కే..?

ఏనుగుల గుంపుని తరలించడంతోపాటు పంట నష్టపరిహారాన్ని అందిస్తామని గత నెల 21న స్థానిక ఎమ్మెల్యే వి కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్‌లు ఏనుగుల సంచారం వల్ల నష్టపోయిన పంటలు పరిశీలించిన సందర్భంగా రైతులకు భరోసా ఇచ్చారు. వీరు పరిశీలన

కిమ్మిలోని పంట పొలాల్లో సంచరిస్తున్న ఏనుగులు

జరిపి దాదాపుగా రెండు వారాలు కావస్తున్నప్పటికి ఎటువంటి చర్యలూ లేకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు విమర్శలు గుప్పిస్తున్నారు. నాయకుల హామీలన్నీ హుళక్కేనని ఎద్దేవా చేస్తున్నారు. సుధీర ప్రాంతాలకు ప్రయాణం సాగించలేక, పంట పొలాలకు పనులకు వెళ్లలేక తీవ్ర భయమందోళనకు గురవుతున్నట్లు ప్రజలు, రైతులు చెబుతున్నారు. ఏనుగుల గుంపు ఇతర ప్రాంతాలకు తరలించేంత వరకూ పంటల సాగు చేయలేమని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏనుగులు గుంపు కారణంగా ఎటువంటి ప్రాణ, పంట నష్టం లేకుండా ఉండేందుకు ప్రభుత్వం అన్ని విధాల చర్యలు తీసుకొని ఈ ప్రాంత నుండి అటవీ ప్రాంతాలకు ఏనుగుల గుంపును తరలించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు .

మాట్లాడుతున్న డాక్టర్ అనురాధ

పౌష్టికాహారాన్ని వినియోగించుకోవాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జాతీయ క్షయ నివారణ విభాగం నిర్వహిస్తున్న ప్రధానమంత్రి టిబి ముక్తభారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా రెడ్‌క్రాస్ కార్యాలయం ఆవరణలో 58 మంది క్షయ రోగులకు పౌష్టికాహార కిట్లను జిల్లా క్షయ నివారణాధికారి డాక్టర్ ఎన్.అనురాధ సోమవారం పంపిణీ చేశారు. చిన్నపిల్లల వైద్యులు కొంచాడ భాగ్యలక్ష్మి, సోమేశ్వరరావు ఛారిటబుల్ ట్రస్టు, ఎ-1 ఆస్పత్రి వైద్యులు జి.ప్రమీల, అఖిల మెమోరియల్ ట్రస్టు ఆర్థిక సహాయంతో రైస్, పప్పు దినుసులు, నూనె, వేరుశనగ పలుకులు, ఇతర సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వీటి ద్వారా రోగుల జీవన ప్రమాణాన్ని మెరుగుపరచుకుని ఆరోగ్యవంతులు కావడానికి దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, వైద్యులు కొంచాడ సోమేశ్వరరావు, వాకర్స్ అధ్యక్షులు కొంక్యాన మురళి, రెడ్‌క్రాస్ సభ్యులు ఎం.కళ్యాణచక్రవర్తి, బి.చిన్మయరావు, కె.సత్యనారాయణ, పవన్, ఎల్.లావణ్య పాల్గొన్నారు.

విద్యా వాలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలి

కురుపాం : ఐటిడిఎ పరిధిలో కొనసాగుతున్న సవర భాష విద్యా వాలంటీర్లను ప్రభుత్వం తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి సుబ్బారావమ్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక మండల కేంద్రంలో ఆమె పత్రిక విలేకరులతో మాట్లాడారు. పార్వతీపురం, సీతంపేట ఐటిడిఎల పరిధిలో గిరిజన విద్యార్థులకు సవరభాష ద్వారా వారికి అర్థమయ్యే భాషలో విద్యను అభ్యసించేందుకు ప్రత్యేకంగా అప్పటి ప్రభుత్వం 332 మందిని నెలకు రూ.5వేలు జీతం ఇస్తూ నియమించిందన్నారు. దీంతో వారు వారి గ్రామాల్లో ఉంటూ కొంత కుటుంబ పోషణకు ఉపయోగపడుతూ గిరిజన విద్యార్థులకు వారికి అర్థమయ్యే భాషలో విద్యను అందించేవారిని చెప్పారు. గత మూడు సంవత్సరాలుగా వారిని తొలగించారంటే గిరిజనులకు విద్యను దూరం చేయడమే తప్ప వేరే ఉద్దేశం కాదని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ స్పందించి తక్షణమే సవర భాష వాలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలని లేనిచో వారి పక్షాన ఆందోళనలు నిరాహార దీక్షలు చేసి వారికి న్యాయం జరిగే వరకు పోరాడుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి అశోక్, సవర భాష వాలంటరీ సంఘ నాయకులు వెంకటేష్, గిరిజన సంఘం నాయకులు ఎం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా స్థావరాలపై దాడులు

పార్వతీపురం టౌన్ : ఎస్ఇబి పోలీసులు, ఒడిశా ఎక్సైజ్ అధికారులు సంయుక్తంగా ఆంధ్ర ఒడిషా సరిహద్దు సమీపంలో పూర్తిగా ఆంధ్ర ప్రాంత గ్రామాలకు నాటు సారా రవాణా చేసే ఒడిషా గ్రామలైన హాటిగడ, రేవటిగుడ సమీపంలో కొండ ప్రాంతంలో నాటు సారా స్థావరాలపై సోమవారం దాడులు చేశారు. 18వేల లీటర్ల నాటు సారా తయారు చేసే బెల్లం ఊటలు, 220 లీటర్ల నాటుసారాను ధ్వంసం చేశారు. ఒడిషా అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సిఐ ఉపేంద్ర తెలిపారు. ఈ దాడుల్లో సిఐ సతీష్, ఎస్ఐలు జె.రాజశేఖర్, శేఖరం, రమణ, స్పెషల్ పార్టీ సిబ్బంది ఉన్నారు.

వాహనాలకు అన్ని పత్రాలూ ఉండాలి

కురుపాం : వాహనాలు నడిపే వ్యక్తులకు డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు వాహనానికి అన్ని పత్రాలు కలిగి ఉండాలని ఆర్‌టిఒ మల్లికార్జున రెడ్డి అన్నారు. సోమవారం సాయంత్రం మండల కేంద్రంలోని రావాడ జంక్షన్ వద్ద వాహనాలు తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్ ట్యాక్స్ తప్పనిసరిగా కట్టాలన్నారు. ట్యాక్స్ కట్టని వాహనాలు తనిఖీల్లో దొరికినట్లయితే 200 శాతం జరిమాన విధించడం జరుగుతుందన్నారు. హై సెక్యూరిటీ నెంబర్ ప్లేట్లు అన్ని వాహనాలకు తప్పనిసరిగా ఉండాలన్నారు. ఆటోలో పరిమితికి మించి ప్యాసింజర్స్‌కి ఎక్కించినట్లయితే కేసులు నమోదు చేస్తామన్నారు.